

భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రోత్సవాలు


# ప్రజా దర్బార్

తెలుగు దినపత్రిక

## జిల్లా అనుబంధం

సంగారెడ్డి - మెదక్ - సిద్దిపేట

మంగళవారం,అక్టోబర్ 13,2026 పేజీలు 8


### ఎల్‌నినో ప్రభావంతో పట్టణాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా

# ముందస్తు చర్యలు చేపట్టాలి

**సంగారెడ్డి, అక్టోబర్ 12 (ప్రజా దర్బార్)** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తక్కువ వర్షపాతం నమోదై భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా లోని ఎనిమిది మున్సిపాలిటీల కమిషనర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...జిల్లా లోని పట్టణ ప్రజలకు తాగునీరు అందించడమే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలు తీర్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీలో తాగునీటి అవసరాలు,



అందుబాటులో ఉన్న నీటి వనరులు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించవలసిన వార్డులు , భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాల వివరాలను సేకరించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో పనిచేయని బోర్ల వివరాలు సేకరించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అదనంగా అవసరమైన బోర్లను గుర్తించి సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నీటి వనరులను పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నీటి వనరులను సంరక్షిస్తూ, అందుబాటులో ఉన్న తాగునీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పాండు,డిడబ్ల్యూ, ఈఈఎస్.కె. పాషా, మునిసిపల్ కమిషనర్లు , మునిసిపల్ డిప్యూటీ ఇంజనీర్లు , సంబంధిత అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజావాణిలోనూ అదే పంచాయితీ..?

**– సమావేశం ఏదైనా తీరు ఒక్కటే! – వారి దారే.... సపరేటూ...**

పటాన్ చెరు, అక్టోబర్ 12, (ప్రజా దర్బార్): సమావేశం ఏదైనా తాము మొబైల్ కే పరిమితమంటూ కొందరు అధికారులు తమ తమ వినూత్న రీతిని ప్రదర్శించి, ప్రజావాణి సమస్యలను పక్కకు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మండల కేంద్రాలలో



నిర్వహిస్తున్న ప్రజావాణి ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్న అధికారులు. కేవలం మూడంటే మూడే గంటలు జరిగే ప్రజావాణిలో సైతం కొందరు అధికారులు తమ తమ మొబైల్ ఫోన్ లకే పరిమితం అవ్వడం హాస్యాస్పదం. అసలే పటాన్ చెరు మండల కేంద్రంలో జరుగుతున్న ప్రజావాణికి ప్రజల నుండి పెద్దగా స్పందన లేకపోవడం పాఠకులకు సుపరిచితమే. సోమవారం పటాన్ చెరు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణిలో ఓ నలుగురు అధికారులు తమదైన శైలిలో మొబైల్ ఫోన్లకే పరిమితమైన దృశ్యాలు స్పందన కు చిక్కాయి

## ప్రమాదంలో గాయపడిన నల్ల ఆంజనేయులు సతీమణికి సోలిపేట సుజాత

దౌల్తాబాద్ అక్టోబర్ 12 (ప్రజా దర్బార్) దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ నల్ల ఆంజనేయులు సతీమణి బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు పడి గాయపడిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సోలిపేట సుజాత రామలింగారెడ్డి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి



తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న సోలిపేట సుజాత రామలింగారెడ్డి గొడుగుపల్లి గ్రామానికి వెళ్లి నల్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులను కలిశారు. గాయపడిన ఆయన సతీమణిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొని నల్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

దుబ్బాక, అక్టోబర్ 12(ప్రజా దర్బార్) నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం ఎంతో అవసరమని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ అన్నారు. కరాటే అనేది కేవలం పోరాట విద్య మాత్రమే కాదని, అది శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించే గొప్ప విద్య అని ఆయన పేర్కొన్నారు.సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని సిద్దార్థ కాన్సెప్ట్ స్కూల్‌లో యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలకు అకాడమీ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ పరిశీలకులుగా వ్యవహరించారు. సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కరాటే నైపుణ్యాలను ప్రదర్శించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు.వివిధ బెల్ట్‌లలో ప్రతిభ చాటిన విద్యార్థులు:పర్పుల్ బెల్ట్: విశ్రుద్,బ్లూ బెల్ట్: రిషి అఖిల్,టీ.సాత్విక్,గ్రీన్ బెల్ట్: క్రిష్, పి.సాత్విక్, ఆరెంజ్ బెల్ట్: శిల్పిత, రిషిత,యెల్లో బెల్ట్: భవిష్య, నక్షనిహానిష్ఈ సందర్భంగా కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యను కూడా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు



కరాటేలో శిక్షణ పొందడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చని, ఆపద సమయంలోఅప్రమత్తంగా వ్యవహరించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.అలాగే చిన్న వయస్సు నుంచే పిల్లలకు కరాటే నేర్పించడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత, సమయపాలన, శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలు, ఆత్మరక్షణ శిక్షణ వైపు ప్రోత్సహించాలని కోరారు.“ఆత్మరక్షణ ప్రతి ఒక్కరికీ అవసరమైన నైపుణ్యం. మహిళలు, బాలికలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుంది. ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణ కలిగిన సమాజ నిర్మాణంలో కరాటే కీలక పాత్ర పోషిస్తుంది” అని ఆయన తెలిపారు.
ఈ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు కరాటే పట్ల ఆసక్తిని పెంపొందించాయని నిర్వాహకులు తెలిపారు

## భక్తిశ్రద్ధలతో దేవిశరన్నవరాత్రోత్సవాలు

కొండపాక,ప్రజా దర్బార్,అక్టోబర్ 12:సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రం లోని రాంపల్లి గ్రామం లో దేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం రోజు భక్తిశ్రద్ధలతో ప్రారంభం కావడం జరిగింది. ఈ కార్యక్రమనికి విగ్రహ దాత వుడెం రాధికా కమలాకర్ రెడ్డి, డెకొరేషన్, వంట సామాగ్రి దాత ధారం మహాస్వి సుధీర్ రెడ్డి, పంతులు దాత దారం జ్యోతి లింగారెడ్డి, చీరల దాత దారం లలిత నర్సింహారెడ్డి, పూజ సామాగ్రి దాత చిగుళ్ల పుష్పలత భాస్కర్ సహకరిచినట్టు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.హిందూ సంప్రదాయంలో శరణ్య నవరాత్రులకు విశిష్టమైన స్థానం ఉందని, ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు



పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు యూత్ సభ్యులు ఏర్పాట్లు చేయడం జరిగిందని ఈ కార్యక్రమం సహకరించిన దాతలకు యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలియజయడం జరిగింది.

## రబీలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి.

### – ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించిన అధికారులు.

### – భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

దౌల్తాబాద్, అక్టోబర్ 12 (ప్రజా దర్బార్)ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసుకునే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని తెలిపారు. మొక్కజొన్న, జొన్న, సజ్జ, వేరుశనగ, పెసర, కందులు, మినుములతో పాటు వివిధ రకాల కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. భూగర్భ జలాలపై ఆధారపడి వరి సాగు చేయడం వల్ల నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని, అందువల్ల




రైతులు పరిస్థితులను అంచనా వేసుకుని పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్షపాతం, నీటి లభ్యత, నేల స్వభావం, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ైతులు పంటల మార్పిడిని అనుసరించడం ద్వారా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవచ్చని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అనుసరించడం అవసరమని సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో మండలంలోని రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, రబీ పంటల ఎంపిక, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

## గోవర్ధనగిరి సర్పంచ్ భర్త పై

# కలెక్టరేట్ లో ఫిర్యాదు



హుస్నాబాద్,అక్టోబర్ 12 ప్రజా దర్బార్) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ పెండల రమ భర్త బాల కొమురయ్య గ్రామంలోని గ్రామపంచాయతీ సమస్యలపై ప్రశ్నించిన వార్డు మెంబర్ చంటి పై దాడికి నిరసనగా ఈరోజు తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ గారికి అలాగే డిపిఓ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్క అనిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె రాజు జిల్లా వార్డు సభ్యులు గొర్ల రమేష్ బత్తుల సతీష్ అనరాసి నాగరాజు మ్యాకల

## సైబర్ నేరాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలి

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.రష్మీ పెరుమాళ్



బెజ్జంకి,అక్టోబర్ 12 (ప్రజాదర్బార్): గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.రష్మీ పెరుమాళ్ అధికారులను ఆదేశించారు.మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. అనంతరం సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్,స్థానిక ఎస్సై తోట తిరుపతితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ పలు కీలక సూచనలు చేశారు.పోలీసు స్టేషన్‌కు తమ సమస్యలతో వచ్చే బాధితులతో సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. రికార్డులను తనిఖీ చేసి,పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మండల పరిధిలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.నేరాల నిర్ధారణ,నిరూపణలో కీలకమైన సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ,మండలంలోని అన్ని గ్రామాల్లో "సురక్ష నేత్ర" కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కుకునూర్ పల్లి ఐటిఐ లో 5వ విడత ప్రవేశాలకు అవకాశం

కొండపాక, ప్రజా దర్బార్, అక్టోబర్ 12:ప్రభుత్వ ఐటీఐలు మరియు అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లలో 5వ విడత ప్రవేశాలకు అవకాశం ఉందని ప్రభుత్వ ఐటిఐ కుక్కునూర్ పల్లి ప్రిన్సిపాల్ వెంకట్ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లలో 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని .కమిషనర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ వారి ప్రకటన ప్రకారం, అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 12 నుండి అక్టోబర్ 15, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 15, 2026 వరకు వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహించబడతాయి. క్రాఫ్ట్మెన్ ట్రైనింగ్ స్కీమ్ కింద ప్రవేశాలకు 2026 ఆగస్టు 1 నాటికి కనీస వయస్సు 14 సంవత్సరాలు నిండి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకొని, ఐటీఐలో అందుబాటులో ఉన్న ట్రేడ్ల వివరాలను తెలుసుకొని ప్రవేశాలుపొందవచ్చు.. అభ్యర్థులు ఈ ఐదవ విడత ప్రవేశాలని రిజిస్ట్రేషన్ కోసం ఐటీఐ కార్యాలయంలో సంప్రదించవలెని ప్రిన్సిపాల్ వెంకట్ రమణ చూచించడం జరిగింది.

## రైతులు ఆరుతడి పంటలనే సాగు చేయాలి.!

**- ఏలినో ప్రభావంతో తాగునీటి సమస్యలు ఏర్పడతాయి..!**

**- సమస్యలు ఉత్పన్నం కాకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలి**

హుస్నాబాద్,అక్టోబర్ 12 (ప్రజాదర్బార్ ) ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కే. హైమా వతి అన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్



నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. హుస్నాబాద్ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కే.హైమావతి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు.

# తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**రాయపోల్ అక్టోబర్ 12 (ప్రజా దర్బార్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వానికి ప్రతిబింబంగా జరుపుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య కో ఆర్డినేటర్ తుడం స్వామి అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో బహుజన బతుకమ్మ కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన బతుకమ్మ ఒక సాంస్కృతిక ఉద్యమం" అనే నినాదంతో ప్రజల సమస్యలపై చైతన్యం కల్పించడం జరుగుతుందన్నారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చెరువులు, కుంటలను పునరుద్ధరించి నీటి ఎద్దడిని నివారించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించాలని సూచిస్తున్నారు. అవినీతి, నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాడుతున్న జెన్ జీ యువతకు సంఘీభావంగా నిలవాలని, విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ నిర్వహణలో ఉండాలని డిమాండ్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్ తదితర దేశాలపై సాగిస్తున్న యుద్ధాలను ఖండిస్తూ, యుద్ధాల వల్ల ఏర్పడుతున్న సంక్షోభాలను నివారించేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వెలివాడలను తొలివాడలుగా గుర్తించి, ఊరు,వాడ అనే తేడా లేకుండా ప్రజలంతా



కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని కోరుతున్నారు.పంచభూతాలను కాపాడేది బహుజనులేనని, ప్రకృతి వనరులను పరిరక్షించుకుంటూ బహుళజాతి సంస్థల దోపిడీని అడ్డుకోవాలని పేర్కొంటున్నారు. బతుకమ్మ పండుగను కేవలం ఆచారంగా కాకుండా ప్రకృతి పరిరక్షణ, ఉపాధి, సామాజిక సమానత్వం కోసం ప్రజలను చైతన్యపరిచే సాంస్కృతిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యాదగిరి, నందు,జోసెఫ్,కుమార్, కనకయ్య, లక్ష్మి, ఎల్లవ్వ, అనిత, నర్సవ్వ, రామవ్వ, భూదవ్వ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

**-వ్యవసాయానికి 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి - మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**

హుస్నాబాద్ అక్టోబర్ 12 : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు. విద్యుత్ కోతలు, లో వోల్టేజీ సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి రోజుకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ఆయన ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం, సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నిరసించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం నాలుగు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. తరచూ విద్యుత్ కోతలు, లో వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో





రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెరుక భాగ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిత్తారి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఇంద్రాల సారయ్య, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, బొల్లి శ్రీనివాస్, గడిపే సంపత్, మాజీ పట్టణ అధ్యక్షులు కన్నోజు రామకృష్ణ, ఎం.ఏ. అన్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు లకావత్ మానస, భూక్య మంగ, బానోతు లక్ష్మి బీలు నాయక్, మాజీ కౌన్సిలర్లు భూక్య లక్ష్మణ్ నాయక్, బొజ్జ హరీష్, నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్ రెడ్డి, నాయకులు కుతాటి విజయ్ భాస్కర్, దకూరి భూపతి రెడ్డి, పూదరి రవీందర్ గౌడ్, వాల నవీన్ రావు, బూర వెంకన్న గౌడ్, చిదురాల అశ్విని, బండి పుష్ప, అక్కన్నపేట, హుస్నాబాద్ పట్టణ, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబం నుండి డిఎస్పి స్థాయికి ఎదిగిన

# శ్రీకాంత్ నాయక్..!



హుస్నాబాద్ అక్టోబర్ 12 (ప్రజాదర్బార్) కలలు కన్నాడు ఆ కలలను సాకారం చేసుకున్నాడు. ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల చిరకాల కోరికను తీర్చిన డీఎస్పీ లావుద్య శ్రీకాంత్ నాయక్.హుస్నాబాద్ మండలం వంగ రామయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పూల్ నాయక్ తండాకు చెందిన లావుద్య సోమనాయక్, లక్ష్మీ దంపతులకు జన్మించిన శ్రీకాంత్ నాయక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఆ తర్వాత బాసర ట్రిబుల్ ఐటీ లో ఉన్నత విద్యను అభ్యసించి అ తర్వాత దాదాపు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. తదనంతరం ఎస్సైగా సెలెక్ట్ అయి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించారు.ఎస్సైగా మంచి ప్రశంసలు అందుకున్న శ్రీకాంత్ నాయక్ అప్పట్లో రాష్ట్రస్థాయిలో అవార్డును కూడా తీసుకోవడం జరిగింది.ఆ తర్వాత గ్రూప్స్ కు ప్రిపేర్ అయి డిఎస్పి ఉద్యోగానికి సెలెక్ట్ కావడం జరిగింది.తన తల్లిదండ్రుల చిరకాల కోరికను సాకారం చేసిన శ్రీకాంత్ నాయక్ ను తన తోటి స్నేహితులు బంధువులు తండావాసులు అభినందించారు.డీఎస్పీ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం శ్రీకాంత్ నాయక్ సోమవారం రాష్ట్ర డిజిపి ,సివి ఆనంద్ చేతుల మీదుగా బెస్ట్ అవుట్ డోర్ సబ్జెక్టు టోపీని అందుకున్నారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రులతో కలిసి ఈ అవార్డును అందుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని డిఎస్పి శ్రీకాంత్ నాయక్ అన్నారు.

# శ్రీకర్ సీడ్స్‌తో నష్టపోయాం.!

- వరి సాగుతో నష్టాలు.. డబ్బుల కోసం రైతులఎదురుచూపులు.
- శ్రీకర్ సీడ్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలి.

# న్యాయం చేయండి..!!

హుస్నాబాద్, అక్టోబర్ 12 (ప్రజాదర్బార్)శ్రీకర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు చెప్పిన మాటలు నమ్మి వరి సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయడంతో పాటు సంబంధిత కంపెనీ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతకపేటకు చెందిన బదనపురం మొగిలి (రేషన్ డీలర్), జీలుగుల గ్రామానికి చెందిన మెరుగు శ్రీనివాస్‌రెడ్డి శ్రీకర్ సీడ్స్ కంపెనీకి సంబంధించిన వ్యవహారాల్లో తమను సంప్రదించారని పేర్కొన్నారు. తమ బావుల వద్దకు వచ్చి శ్రీకర్ సీడ్స్ వరి విత్తనాలు సాగు చేస్తే ఎకరానికి రూ.70 వేల వరకు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారి మాటలు నమ్మి గత యాసంగి సీజన్‌లో వరి సాగు చేయగా, ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పండిన ధాన్యాన్ని తీసుకెళ్లినప్పటికీ తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు.ఈ విషయమై హుస్నాబాద్ సీఐ శ్రీధర్ ను కలిసి ఫిర్యాదు చేయగా, నెల రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత తిరిగి సంప్రదించగా, డబ్బులు లేవని చెప్పడంతో పాటు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సోమవారం ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు



చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ స్పందించి, సంబంధిత కంపెనీ, ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను ఆదేశించాలని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

## వెంచర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేతతో ఉపాధి కోల్పోయాం

### . సబ్ కలెక్టర్ కు కార్మికుల వినతి



**నారాయణఖేడ్, అక్టోబర్12 ( ప్రజా దర్బార్ )** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వెంచర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ఉపాధి కోల్పోయామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతిపత్రం అందజేశారు. గతంలో హైదరాబాద్‌లో నెలకు రూ.8 వేల జీతానికి పనిచేసేవారమని, నారాయణఖేడ్‌లో వెంచర్లు ఏర్పాటయ్యాక నెలకు రూ.30 వేల వరకు సంపాదించి కుటుంబాలను పోషించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## నీరు లేక నెర్రబారుతున్న భూములు

- కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు!
- అనంతారంలో ఎండిపోతున్న పంటలను
- పరిశీలించిన రాష్ట్ర నాయకుడు సిజిఆర్
- సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్...

**గుమ్మడిదల, అక్టోబర్ 12 (ప్రజాదర్బార్) :** గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీరు అందక భూములు నెర్రబారుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి అత్యంత కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు సకాలంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు మళ్లీ తలెత్తుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ పరిష్కారం చూపాలని ఆయన కోరారు. సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు జింక గోపాల్, మహేష్ యాదవ్, తలారిమహేష్, శ్రీశైలం, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.



## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా ...

- పెరుగు సాయిలు కుటుంబానికి పరామర్శ..

**గుమ్మడిదల, అక్టోబర్12 (ప్రజాదర్బార్)** గుమ్మడిదల మండల బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుల కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెరుగు సాయిలు కుటుంబాన్ని సోమవారం పరామర్శించిన సందర్భంగా ఆయన ఈ భరోసా కల్పించారు. సాయిలు కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతారం సర్పంచ్ కొమ్ము శీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, స్థానిక నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసును చేదించిన చిరాక్ పల్లి పోలీసులు...

**జహీరాబాద్ అక్టోబర్ 12 (ప్రజాదర్బార్)** జహీరాబాద్ నియోజక వర్గంలోని చిరాక్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఆదివారం నాడు హత్య జరిగిన సంఘటన కొద్ది గంటల్లోనే కేసును ఛేదించిన చిరాగ్ పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుంకుంట గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన మున్నూరు శ్రీనివాస్ హత్య కేసును జహీరాబాద్ టౌన్ సీఐ రాజ బోయిన రవి, ఎస్ఐ వినయ్ కుమార్ వారి సిబ్బంది సమన్వయంతో వేగవంతమైన దర్యాప్తు చేపట్టి కొద్ది గంటల్లోనే ఛేదించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, నిందితులు మృతుని అల్లుడు ఏ1 ఎర్ర బసవరాజు మృతుడి నీ చంపడానికి నేరస్తులకు రూపాయలు 500000/- ఇచ్చి శ్రీనివాస్ కు హత్య చేయమని ఒప్పందం కుదుర్చుకొనగా బంటారం గ్రామానికి చెందిన ఏ -2 జడల రమేష్, ఏ -3 జడల సుభాష్, ఏ-4 పరిగి మురళి అందరూ కలిసి మృతుడి ఆటోను అద్దెకు తీసుకుని, అనంతరం తుంకుంట గ్రామ సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి అతనిపై దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడైంది. నేరానికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసే ఉద్దేశంతో మృతదేహం, ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు విచారణలో తెలిసింది. ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించి నేరస్థుల వద్ద నుండి రూపాయలు 200000/- నాలుగు సెల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆయుధాలు మరియు మోటార్ సైకిల్ లను స్వాధీన పరుచుకోవడం జరిగింది. హత్య కేసును చేధించుటలోసమర్థవంతంగా పనిచేసిన సీఐ రాజబోయిన రవి, ఎస్ఐ వినయ్ కుమార్ పోలీసు కానిస్టేబుల్లు రాకేష్, హరినేత్ర, ఓం దేవ్, అస్లామ్ సిబ్బందిని అభినందించినారు.




## 265 మందికి ఉచిత శిక్షణ....



**జహీరాబాద్ అక్టోబరు12 (ప్రజాదర్బార్)** ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు జహీరాబాద్‌లోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో 45 రోజుల ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న 588 మందికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించగా, 265 మంది అర్హత సాధించారు. ఎంపికైన అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సైదా నాయక్, ఆర్డీవో దేవుజా, ఆర్ఎల్ఆర్ పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్. లక్ష్మారెడ్డి, టౌన్ సీఐ రవి, గ్రామీణ సీఐ నరసింహ, సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు



## ప్రజావాణిలోనూ అదే పంచాయితీ..? - సమావేశం ఏదైనా తీరు ఒక్కటే!

### - వారి దారే.... సపరేటూ.....









**పటాన్ చెరు, అక్టోబర్ 12, (ప్రజాదర్బార్)** సమావేశం ఏదైనా తాము మొబైల్ కే పరిమితమంటూ కొందరు అధికారులు తమ తమ వినూత్న రీతిని ప్రదర్శించి, ప్రజావాణి సమస్యలను పక్కకు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజావాణి ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్న అధికారులు. కేవలం మూడంటే మూడే గంటలు జరిగే ప్రజావాణిలో సైతం కొందరు అధికారులు తమ తమ మొబైల్ ఫోన్ లకే పరిమితం అవ్వడం హాస్యాస్పదం. అసలే పటాన్ చెరు మండల కేంద్రంలో జరుగుతున్న ప్రజావాణికి ప్రజల నుండి పెద్దగా స్పందన లేకపోవడం పాఠకులకు సుపరిచితమే. సోమవారం పటాన్ చెరు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ ప్రజావాణిలో ఓ నలుగురు అధికారులు తమదైన శైలిలో మొబైల్ ఫోన్లకే పరిమితమైన దృశ్యాలు ప్రజాదర్బార్ చిక్కాయి.